మహాదేవ్ జాతర ప్రారంభం

సిర్పూర్(యూ) ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని మహాదేవ్ మందిరం ఆధ్వర్యంలో జాతర శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఆచారంలో భాగంగా ఆత్రం వంశీయులు ఊరేగింపుతో పురాతనమైన మహాదేవ్ మందిరానికి చేరుకొని ఆత్రం శ్రీరావ్ రాజా (కటొడ) ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా జాతర ప్రారంభమైంది. ఆదివాసీ ప్రజలు నిర్వహిస్తున్న ఈ జాతరకు ఏంతో ప్రాముఖ్యత ఉంది. సుమారు ఎనభై ఏళ్లుగా ఇక్కడ జాతర నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఎడ్ల పరుగు పందేలు, వాలీబాల్, కబడ్డీ, కుస్తీ వంటి క్రీడాపోటీలు నిర్వహించడం ఆనవాయితీ. మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున మందిరానికి వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. సుమారు 15 రోజుల పాటు ఇక్కడ జాతర నిర్వహిస్తామని జాతర కమిటీ చైర్మన్ ఆత్రం దౌలత్‌రావ్ తెలిపారు.

అదుపుతప్పి గుంతలో పడ్డ ద్విచక్ర వాహనం

- యువకుడి మృతి .. ఇద్దరికి గాయాలు

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 24 : ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడడంతో డబ్బా గ్రామానికి చెందిన లెండుగురే అజయ్ (20) మృతి చెందగా, మరో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన లెండుగురే అజయ్ 15 రోజులుగా తన అక్క మనీషా వద్ద పనిచేస్తున్నాడు. అజయ్ అతని మిత్రుడైన కౌటాలకు చెందిన రాజేశ్, బోదంపల్లికి చెందిన కోట్రంగి శ్రీశైలంతో కలిసి శుక్రవారం రాత్రి 9 గంటలకు కౌటాల నుంచి కాగజ్‌నగర్‌కు బయలుదేరారు. సిర్పూర్(టీ) మండలంలోని వేంపల్లి అడవిలో రాత్రి దాదాపు 11గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ముగ్గురు రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయారు. తీవ్రగాయాలైన లెండుగురే అజయ్ అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున సమాచారం తెలుసుకున్న బంధువులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన రాజేశ్, కోట్రంగి శ్రీశైలంను కాగజ్‌నగర్‌లోని దవాఖానకు తరలించారు. అజయ్ మృతదేహాన్ని సిర్పూర్(టీ) దవాఖానలో భద్రపరిచారు.

దహెగాం-లగ్గాంలో కల్లంలో ఆరబెట్టిన మిరప పంట

మిర్చి రైతు కుదేలు

- అనుకూలించని వాతావరణం.. సోకిన తెగుళ్లు
- తగ్గిన దిగుబడి.. లభించని మద్దతు ధర
- ఆదుకోవాలని వేడుకోలు

దహెగాం, ఫిబ్రవరి 24: కోటి ఆశలతో మిర్చి పంట సాగు చేసిన రైతన్నకు నిరాశే మిగిలింది. వాణిజ్య పంటల సాగుతో ఆర్థికంగా ఎదగవచ్చని మండలంలో పలు గ్రామాల్లో రైతులు మిరపంట సాగు చేశారు. పంట వేసినప్పటినుంచి వాతావరణం అనుకూలంచలేదు. దీనికితోడు విపరీతమైన తెగుళ్లు సోకడంతో రైతులు అంచనాకు మించి పురుగు మందులు, ఎరువులకు ఖర్చు చేశారు. అయినా దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. ఇన్ని చేసినా మద్దతు ధర లేదు. మొత్తం మీద ఈ యేడాది మిర్చి రైతులు కుదేలవుతున్నాడు. దీంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మండలంలోని లగ్గాం, దహెగాం, ఐనం, హత్తిని, పీపీరావుకాలనీ, ఒడ్డుగూడ, ఇట్యాల గిరివెల్లి గ్రామాల్లో మూడు వందల ఎకరాల్లో మిరప పంటను సాగు చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.1లక్షా 30 వేల నుంచి 1లక్షా 50 వేల వరకు ఖర్చు చేశారు.

సోకిన తెగుళ్లు

విత్తనం నారు అలికిన నుంచి మొదలకుంటే నేటి వరకు వివిధ రకాల వైరస్‌లు, తెగుళ్ల సోకాయి. వైరస్ కారణంగా మొదట్లోనే కొన్ని మొక్కలు చనిపోయాయి. అలాగే ఏరుకుళ్లు, కొమ్మకుళ్లు, ఎర్రనల్లి, పిండినల్లి వంటి తెగుళ్లు సోకాయి. ఎర్రనలితో ఆకులు రాలిపోయి తోటలు ఎండిపోయాయి. రైతులు చేసేదేమీ లేక తోటలను వదిలేసుకున్నారు.

తగ్గిన దిగుబడి

మిరప తోటకు తెగుళ్లు రావడంతో దిగుబడి తగ్గిపోయింది. సాధారణంగా ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రావాలి. ఈ సంవత్సరం మాత్రం ఎకరాకు 7 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దక్కని మద్దతు ధర

వివిధ రకాల తెగుళ్లతో పంట దిగుబడి రాక ఇబ్బంది పడుతున్న రైతులకు మద్దతు ధర కరువైంది. గతేడాది క్వింటాలకు రూ.20 నుంచి 25 వేల మద్దతు ధర వచ్చింది. కానీ ప్రస్తుతం క్వింటాలుకు రూ.13 నుంచి 15 వేల వరకు పలుకుతోంది. దీంతో సాగుకోసం పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎకరానికి లక్షా యాభై వేలు ఖర్చయినయ్

ఈ ఏడాది ఎకరానికి లక్షా యాభై వేల రూపాలు ఖర్చయినయి. మొదటి నుంచి వాతావరణం అనుకూలించలే. విపరీతమైన తెగుళ్లు సోకినయి. ఎంతో ధైర్నంజేసి మందులు కొట్టిన. అయినా పంట దిగుబడి సరిగ్గ రాలె. ప్రభుత్వం మద్దతు ధర గూడ ఇవ్వడం లేదు. పోయినసారి క్వింటాలుకు రూ.20, 25 వేల వరకు ఇచ్చిర్రు. గిప్పుడు 15 వేల రూపాలల్లోపే మద్దతు ఉందన్నరు. రేటు లేక మిర్చిని కళ్లాల్లోనే కుప్పలు వోసి ఉంచినం. ప్రభుత్వం మద్దతు ధర పెట్టి మిర్చి రైతులను ఆదుకోవాలి.

-ఇంగిలి రాకేశ్, ఏనెగూడెం

ప్రైవేట్ గోదాంలో మిర్చి బస్తాలు పెట్టిన

వరంగల్ మార్కెట్ వద్ద ప్రైవేట్ గోదాములో మిర్చి బస్తాలు పెట్టి వచ్చిన. వారం క్రితం నలుగురు రైతులతో పాటు నేను మిర్చి బస్తాలు లారీలో తీసుకొని వరంగల్ మార్కెట్‌కు వెళ్లిన. ఆ రోజు క్వింటాలుకు రూ.13 నుంచి 15 వేల రూపాలు పలికినయి. చేసేది లేక ప్రైవేటు కోల్డ్ స్టోరేజ్‌ల కిరాయికి మిరప బస్తాలను పెట్టి వచ్చినం. రేటు కోసం ఎదురు సూత్తాన్నం.

-ఇంగిలి చంద్రశేఖర్, లగ్గాం

ఈయేడు వాతావరణం అనుకూలించలేదు

ఈ సంత్సరం మిరప సాగుకు వాతావరణం ఏ మాత్రం అనుకూలంగా లేకుండె. వాతావరణంలో మార్పుల కారణంగా పంటకు వివిధ రకాల వైరస్, తెగుళ్లు విపరీతంగా సోకాయి. అయినా ఎప్పటికప్పుడు రైతుల వద్దకు వెళ్లి తోటలను పరిశీలించి సలహాలు సూచనలు చేశాం. రైతులు ఏ మాత్రం వెనుకాడకుండా పంటలకు మందులను వాడారు. అయినా ఆశించన ఫలితం రాలేదు.

-వంశీకృష్ణ, మండల వ్యవసాయాధికారి, దహెగాం

విజేతలకు బహుమతి అందజేస్తున్న జాతర కార్య నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షుడు, చుంచు శ్రీనివాస్, వెడ్మ కమల

క్రీడలతో మానసికోల్లాసం

తిర్యాణి, ఫిబ్రవరి 24: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, గిరిజన యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జాతర కార్యనిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, వెడ్మ కమల అన్నారు. మండలంలోని కన్నెపల్లి పంచాయతీ పరిధిలోని అరటిపల్లి స్టేజీ వద్ద ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన శ్రీసమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా వాలీబాల్,కబడ్డీ ఆటల పోటీలను నిర్వహించారు. వాలీబాల్‌లో 30, కబడ్డీలో 28 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి గెలుపొందిన జట్టుకు రూ.6050, ద్వితీయ జట్టుకు రూ.4050 నగదు బహుమతిని జాతర కార్యనిర్వహణ కమిటీ అధ్యక్షుడు వెడ్మ భగవంతరావుతో కలిసి విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు మార్నేని తిరుపతి, క్రీడల నిర్వాహకులు సామనపల్లి బ్రహ్మం, సుభాశ్, కుర్సెంగ శ్రీనివాస్, గ్రామ పటేల్ వెడ్మ శంకర్, మాజీ ఉప సర్పంచ్ సరిత, పూజారులు సత్తయ్య గౌడ్, కరగంటి బాపు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పనుల్లో అలసత్వం వద్దు

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు
- కౌటాల మండల సర్వ సభ్య సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

కౌటాల, ఫిబ్రవరి 23: అధికారులు పనులు చేయకుండా అలసత్వం వహిస్తే ఊరుకోబోమని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు హెచ్చరించారు. శనివారం కౌటాల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు సక్రమంగా పనిచేయకుండా కాలయాపన చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కౌటాల మండలంతో పలు మండలాలకు వెళ్లే రోడ్లు బాగా లేవని అన్నారు. రైతులు సాగు నీరందించేందుకు ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు. టైగర్ కారిడార్ పేరిట పోడు రైతులను వ్యవసాయం చేసుకోనివ్వకుండా అటవీ అధికారులు సాగుకు దూరం చేస్తున్నారన్నారు. ప్రతి పోడు రైతుకు పట్టా వచ్చే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. మిరప రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలను స్థానికంగా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కన్నెపల్లి ఎంపీటీసీ మోతీరాం మాట్లాడుతూ, గత సమావేశాల్లో సమస్యలు చెప్పినప్పటికీ ఇప్పటివరకు వాటిని పరిష్కరించలేదన్నారు. మండల కేంద్రంలోని పాత పీహెచ్‌సీ స్థలం కబ్జాకు గురవుతుందని, దానిని ఇంతవరకు అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. బోదంపల్లి, కనికి గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. విద్యుత్ సమస్యలు తీర్చాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతీ రాజ్ పనులు నాసిరకంగా జరుగుతున్నట్లు అధికారులకు తెలియజేశారు. దీనికి పంచాయతీరాజ్ ఏఈ మక్బాల్ మాట్లాడుతూ, నాసిరకంగా పనులు చేసిన వాటిని గుర్తించి అవసరమైతే రికవరీ చేపిస్తామన్నారు. ఎంపీపీ విశ్వనాథ్ మాట్లాడుతూ, అధికారులు, ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమ్రం మాంతయ్య, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో అబ్దుల్ నస్రుల్లాఖాన్, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దహెగాంలో ప్రారంభమైన సమ్మక్క జాతర

జాతరకు హాజరైన భక్తులు

దహెగాం, ఫిబ్రవరి 24 : మండల కేంద్రం సమీపంలోని రావుల మల్లన్న వాగు వద్ద శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రధాన పూజారి నాయిని స్వరూప ఆధ్వర్యంలో వన దేవతలను తీసుకచ్చి సంప్రదాయ పద్ధతుల్లో గద్దెలపై ప్రతిష్ఠించారు. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజుల పాటు వేడుకలు కొనసాగుతాయని పూజారి తెలిపారు.

లక్ష్మీపూర్ సమ్మక్క గద్దెల వద్ద భక్తులకు బొట్టుపెట్టి ఆశీర్వదిస్తున్న పూజారి దేవర వినోద్

ముగిసిన వనదేవతల జాతర

రెబ్బెన, ఫిబ్రవరి 24 : రెబ్బెన మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ శివారు, దేవులగూడ గ్రామ శివారు, నక్కలగూడ గ్రామాల్లో గద్దెలపై కొలువై పూజలందుకున్న సమ్మక్క సారలమ్మలు శనివారం తిరిగి వనప్రవేశం చేశారు. వనదేవతలను భక్తులతో కలిసి పూజారులు గొల్లపెల్లి సత్తమ్మ, దేవర వినోద్, ఇగురపు స్వామి భక్తి శ్రద్ధలతో తీసుకొని వెళ్లారు. చివరి రోజు శనివారం కావడంతో భక్తులు తల్లులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించిన మాలీ సంఘం నాయకులు

బెజ్జూర్, ఫిబ్రవరి 24 : ఇటీవల మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో పూలే దంపతుల విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాలీ కులస్తులు శనివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించారు. దండుగులను కఠినంగా శిక్షించడంతోపాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ విక్రమ్ హామీతో ఆందోళన విరమించారు. ఇక్కడ మాలీ సంఘ మండలాధ్యక్షుడు ఆదె అశోక్, ఉపాధ్యక్షుడు సెండె బాబూరావు, యూత్ అధ్యక్షుడు సురేశ్, నాయకులు బాబూరావు, గోపాల్, తిరుపతి, నీలయ్య, శంకర్ ఉన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బెజ్జూర్, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలో కీ.శే. కొండ్ర బుచ్చమ్మ, కొండ్ర హన్మాగౌడ్ జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యూ ఆప్టికల్స్ అండ్ కంటి దవాఖాన వారి ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలున్న వారు వైద్యులను సంప్రదించి చికిత్స చేసుకిని, మందులు ఉచితంగా పొందాలని వారు కోరారు.

ఘనంగా మాఘ పౌర్ణమి

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి భక్తులు ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గంగు సత్యనారాయణ శర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయండి

రెబ్బెన, ఫిబ్రవరి 24 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 26న జరిగే లంబాడా కులస్థుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ 285 జయంతి వేడుకలను విజయవంతం చేయాలని సేవాలాల్ జయంత్యుత్సవ సమితి అధ్యక్షుడు గుగులోత్ రవినాయక్ పిలుపునిచ్చారు. శనివారం దీక్షగురు ప్రేమ్‌సింగ్ మహారాజ్‌కు ఆహ్వాన పత్రిక అందించిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు రాథోడ్ రుప్లా, నరహరి, తిరుపతి, రాజేందర్‌తో పాటు పలువురు ఉన్నారు.

దీక్షగురు ప్రేమ్‌సింగ్ మహారాజ్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న సేవాలాల్ జయంత్యుత్సవ కమిటీ సభ్యులు

సీసీరోడ్డు పనులు ప్రారంభం

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 24 : బాబాపూర్‌లో సీసీరోడ్డు పనులను శనివారం ఎంపీపీ డుబ్బుల నానయ్య ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకయ్య, జునుగరి శేఖర్, రాపల్లి రాజయ్య, బోర్కుట్ వెంకయ్య, లోడెల్లి ప్రవీణ్, చప్లె శ్రీనివాస్, పొలాజీ రాజన్న, కోసన వాగయ్య, లచ్చన్న, సురేశ్ పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పిస్తాం

పాటగూడలో పర్యటిస్తున్న ఎంపీపీ మోతీరాం, ఎంపీడీవో కృష్ణారావు

కెరమెరి, ఫిబ్రవరి 24: వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఎంపీపీ పెందోర్ మోతీరాం, ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని మారుమూల గ్రామమైన పాటగూడను సందర్శించి పరిస్థితులపై సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎత్తైన ప్రాంతంలో గ్రామం ఉండడంతో మిషన్ భగీరథ పథకం నీళ్లు అందడం లేదని, వేసవికాలంలో నీటి సమస్య ఏర్పడకుండా ఈజీఎస్ ద్వారా బావి నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఉపాధి హామీ పథకంతో కూలీలకు పనులు కల్పిస్తూనే ప్రజల దాహార్తి తీర్చేందుకు నివారణ చర్యలు చేపడుతామని తెలిపారు.

సింగరేణి

పారదర్శకంగా ఇంటర్వ్యూలు

గోలేటి జీఎం కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఖైర్‌గూడ పీవో సత్యనారాయణ

రెబ్బెన, ఫిబ్రవరి 24 : సింగరేణిలో ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులకు నిర్వహించే కారుణ్య నియామకాల ఇంటర్వ్యూలను పారదర్శంగా నిర్వహిస్తామని ఖైర్‌గూడ పీవో సత్యనారాయణ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో గల కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం దరఖాస్తు చేసుకున్న వారి కుటుంబ సభ్యులకు ఇంటర్వ్యూలు నిర్వహించి పత్రాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఖైర్‌గూడ ఓసీపీ మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, డీవైపీఎం వేణు, సీనియర్ పీవో ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ బాబా పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

గోలేటి టౌన్‌షిప్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

రెబ్బెన, ఫిబ్రవరి 24: పంజాబ్ రైతులపై పోలీసుల కాల్పులకు వ్యతిరేకంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గోలేటి టౌన్‌షిప్‌లో శనివారం కాంట్రాక్టు కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినట్లు ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీనివాస్, పోశం తెలిపారు. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై రబ్బర్ బుల్లెట్లతో పోలీసులు కాల్పులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాల్పులకు అనుమతిచ్చిన పోలీసు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సికిందర్, భీమేశ్, సంతు, లింగయ్య, కుమార్, చంద్రయ్య, పోసుబాయి, రాణి, కమల, రాధ, శారద, తార, పలువురు ఉన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

బస్టాండ్‌లో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, కళాకారులు

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 24 : ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ పార్టిసిపేషన్ (స్వీప్)పై గ్రామస్తులకు కళాజాతా బృందంతో అవగాహన కల్పించారు. ఇక్కడ ఎంపీవో కృష్ణమూర్తి, కళాజాత బృంద సభ్యులు ఉన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

పిల్లలకు కథలు వినిపిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సౌందర్య

తిర్యాణి, ఫిబ్రవరి 24 : విద్యార్థులు పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని రూమ్ టూ రీడ్ బ్లాక్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసాచారి పేర్కొన్నారు. మండలంలోని డోర్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. రూమ్ టూ రీడ్ బ్లాక్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సౌందర్యతో కలిసి విద్యార్థులు గోండి, కొలామి భాషల్లో పఠనం చేశారు. అనంతరం గోండి, కొలామి కథల పుస్తకాలను వారికి అందజేశారు. ఇక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంస్థ సిబ్బంది ఉన్నారు.

నూతన తహసీల్దార్‌కు సన్మానం

తహసీల్దార్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

సిర్పూర్(యూ) ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బదిలీపై వచ్చిన నూతన తహసీల్దార్ ఉదయ్ కుమార్‌ను మండల నాయకులు శాలువాతో సన్మానించారు. మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగ్వంత్‌రావ్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తొడసం దర్మారావ్, వీటీడీఏ మండలాధ్యక్షుడు కుమ్ర భీమ్‌రావ్ నాయకులు అర్క నాగోరావ్, మడవి బొజ్జిరావ్, తొడసం గంగారాం ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

సిర్పూర్(యూ) ఫిబ్రవరి 24 : మండలంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ ఉదయ్‌కుమార్ పరిశీలించారు. మండలంలోని మహాగావ్, రాఘూపూర్, దేవుడ్‌పల్లి, పుల్లర, సీతాగొంది, పంగిడి, బాబ్జీపేట్, ఖాతిగూడ, పవర్‌గూడ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. మండలంలో మొత్తం 21పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ బీఎల్‌వోలు, సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

మద్యం (ఆల్కహాల్) మాన్పించబడును

★త్రాగుడు (ఆల్కహాల్) & సిగరెట్, గుట్కా మానండి, మాన్పించండి. త్రాగేవారికి తెలియకుండా ఆయుర్వేద మందుతో మాన్పించవచ్చు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు. కేంద్రీయ ఆయుర్వేద. ఫోన్: 9652899899.
NT-319957

ప్లాట్లు కొనబడును

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, పసుమాముల, రామోజీ, కోహెడ, సాగర్ పంపు, గుంతపల్లి, బాటసింగారం, తూప్రాన్‌పేట్, మల్కాపురం, పోచంపల్లిలో ప్లాట్లు కొనబడును. J.సుధాకర్ గౌడ్: 9948172307, 9390846522.
NT-313886

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-All

CHANGE OF NAME

★I, POLSETTI MARIYANRAJU (Old Name), R/o. 26-5-124, Radagambala Basthi, Bellampally-504 251. Changed My Name as POLISETTI MARIYANRAJU (New), S/o. Polisetti Lourdaiah.
NT-311954

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677